











అర్హతే ప్రామాణికం

సారవకోట: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందజేస్తున్నారని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని అవలింగి సచివాలయ పరిధిలోని లక్ష్మీపురంలో ఎంపీటీసీ సభ్యుడు మెండ బాలచంద్రరావునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పొన్నాన హరిప్రసాద్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారు..

గ్రామానికి చెందిన కొన్నేళ్ల క్రితం డీపట్టాలిచ్చిన 95 సెంట్లకు సంబంధించిన ఇళ్ల స్థలాలకు పట్టాలివ్వకుండా స్థానిక సర్పంచ్, టీడీపీ నాయకుడు అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. తమకు కొన్ని దశాబ్దాల క్రితం చెరువు గట్టుపై ఇచ్చిన ఇళ్ల పట్టాలు అందజేయకుండా టీడీపీ నాయకుడు ఆయన వద్దే ఉంచుకున్నారని గ్రామానికి చెందిన సొప్పర్ల అప్పన్న, కిష్టప్ప, ప్రసాదరావు, నారాయణరావు, వెంకటరావు, లవుడు ఆరోపించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించారు. తహసీల్దార్ హనుమంతురావుతో మాట్లాడారు. గ్రామాన్ని సందర్శించి లబ్ధిదారులకు పట్టాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ప్రభుత్వం పేద ప్రజల పక్షాన పనిచేస్తుందన్నారు. ప్రజాప్రతినిధులు ఇటువంటి చర్యలకు పాల్పడితే క్షమించేది లేదన్నారు.















రాష్ట్రంలో సుపరిపాలన

పొందూరు: జనవరిలో రూ.3 వేల పింఛన్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కనిమెట్ట గ్రామంలో నిర్మించిన నూతన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఆదివారం స్పీకర్ ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ మాట్లాడుతూ.. కనిమెట్ట గ్రామ సచివాలయం పరిధిలో అన్ని పథకాల లబ్ధి కలిసి సుమారు రూ.17 కోట్ల 35లక్షలు, పరోక్షంగా లబ్ధి సుమారు రూ.21 కోట్లు అందిందన్నారు. ఎంపీపీ కిల్లి ఉషారాణి, జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

సంతోషంగా ఉండాలి

ఎల్.ఎన్.పేట: కొత్త సంవత్సరంలో పాతపట్నం నియోజకవర్గ ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలు విడుదల చేశారు. ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పూరిల్లు దగ్ధం

బూర్జ: చీడివలస గ్రామానికి చెందిన చించిలి కృష్ణకు చెందిన పూరిల్లు ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. స్థానికుల సాయంతో మంటలను నిలుపుదల చేశారు. రెవెన్యూ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. పూరిల్లు పైన ఉన్న విద్యుత్ వైర్ల నుంచి నిప్పులు రాలడంతో ప్రమాదం సంభవించిందన్నారు. కుమ్మరి కులస్తుడైన కృష్ణ సంక్రాంతి కోసం మట్టి కుండలు తయారు చేసి అమ్మకానికి సిద్ధంగా ఉంచాడు. మట్టి పాత్రలు కాలిపోవడంతో లబోదిబో మంటున్నాడు.









